




## తండ్రీ

**మూలవాక్యము:- లూకా 23:34:**

యేసు- తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను. వారు ఆయన వస్త్రములు పంచుకొనుటకై చీట్లు వేసిరి.

12 యేండ్ల వయస్సులోనే నేను నా తండ్రి పనులమీద నుండవలెనని మీరెరుగరా అని తండ్రితో తన బంధాన్ని, బాధ్యతలను మొదలు పెట్టిన యేసుక్రీస్తు కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రజల యెదుట తండ్రికి తనకు గల సంబంధాన్నిరుజువుపరచుట కొరకు నేరుగా తండ్రితో మాట్లాడారు, ప్రార్థించారు,

యేసయ్య ఎలుగెత్తి "తండ్రీ" అని పిలిచిన కొన్ని సందర్భాలను వాక్యములో నుండి మీకు తెలియజేస్తున్నాను. ఆ పిలుపులు, మాటలు తండ్రితో తనకున్న సంబంధ భాంధవ్యాలను తెలియజేస్తున్నాయి

### 1. తండ్రి పసిబాలురకు మరుగైన సంగతులు బయలుపరచినప్పుడు:-

లూకా 10:21 ఆ గడియలోనే యేసు పరిశుద్ధాత్మయందు బహుగా ఆనందించి- తండ్రీ, ఆకాశమునకు భూమికిని ప్రభువా, నీవు జ్ఞానులకును వివేకులకును ఈ సంగతులను మరుగు చేసి పసిబాలురకు బయలు పరచినావని నిన్ను స్తుతించుచున్నాను. అవును తండ్రీ, ఆలాగు నీ దృష్టికి అనుకూలమాయెను.

### 2. లాజరును మరణము నుండి లేపుటకు సమాధి యొద్దకు వెళ్లినప్పుడు:- యోహా 11:41

అంతట వారు ఆ రాయి తీసివేసిరి. యేసు కన్నులు పైకెత్తి- తండ్రీ, నీవు నా మనవి వినినందున నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను.

### 3. యేసయ్య ప్రాణము కలవరపడుచున్నప్పుడు:- యోహా 12:27,28

ఇప్పుడు నా ప్రాణము కలవరపడుచున్నది; నేనేమందును?- తండ్రీ, యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము. అయినను ఇందుకోసరమే నేను ఈ గడియకు వచ్చితిని.

### 4. యేసయ్య గడియ సమీపించినప్పుడు:- యోహా 17:1

యేసు ఈ మాటలు చెప్పి ఆకాశము వైపు కన్నులెత్తి యిట్లనెను- తండ్రీ, నా గడియ వచ్చియున్నది.

**5. నన్ను మహిమపరచుమని వేడుకొనుచున్నప్పుడు:- యోహా 17:5**

తండ్రీ, లోకము పుట్టుకమునుపు నీ యొద్దకు నాకు ఏ మహిమయుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమ పరచుము.

**6. పరిశుద్ధ తండ్రితో తను ఏకమైయున్నట్లు :- యోహా 17:11**

నేనికను లోకములో ఉండను గాని వీరు లోకములో ఉన్నారు; నేను నీ యొద్దకు వచ్చుచున్నాను. పరిశుద్ధుడవైన తండ్రీ, మనము ఏకమై యున్న లాగున వారును ఏకమై యుండునట్లు నీవు నాకు అనుగ్రహించిన నీ నామమందు వారిని కాపాడుము.

**7. తండ్రే తనను పంపించారని లోకము తెలుసుకోవాలని కోరుకున్నప్పుడు:- యోహా 17:20,21**

మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నా యందు నీవును నీ యందు నేనును ఉన్న లాగున వారును మనయందు ఏకమైయుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు. వారి వాక్యమువలన నా యందు విశ్వాసముంచువారందరును ఏకమైయుండవలెనని వారి కొరకు ప్రార్థించుచున్నాను.

**8. శిష్యులు కొరకు ప్రార్థించునప్పుడు:- యోహా 17:24**

తండ్రీ, నేనెక్కడ ఉందునో అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నాతో కూడ ఉండవలెననియు, నీవు నాకు అనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు, కోరుచున్నాను. జగత్తు పునాది వేయబడక మునుపే నీవు నన్ను ప్రేమించితివి.

**9. తండ్రి నీతి స్వరూపడని పిలుస్తూ ప్రార్థించినప్పుడు:- యోహా 17:25**

నీతి స్వరూపుడవగు తండ్రీ, లోకము నిన్ను ఎరుగలేదు; నేను నిన్ను ఎరుగుదును; నీవు నన్ను పంపితివని వీరెరిగియున్నారు.

**10. ఒలీవ కొండలో గెత్సెమనే చోటుకు వచ్చినప్పుడు:- మార్కు 14:36**

నాయనా తండ్రీ, నీకు సమస్తము సాధ్యము; ఈ గిన్నె నాయొద్దనుండి తొలగించుము; అయినను నా యిష్ట ప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్ము అనెను.

**11. బంది పోటు దొంగలు దూషించినపుడు :మత్తయి 27:44**

**ఆయనతో కూడా సిలువ వేయబడిన బందిపోటుదొంగలును ఆలాగే ఆయనను నిందించిరి.**

## 12. ప్రాణమును తండ్రికి అర్పించునపుడు:

**లూకా 23:46** అప్పుడు యేసు గొప్ప శబ్దముతో కేకవేసి – తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను. ఆయన యీలాగు చెప్పి ప్రాణము విడిచెను.

ఇలా యేసయ్య కొన్ని సందర్భాలలో ఎలుగెత్తి తండ్రిని " తండ్రీ" అని పిలిచారు. "తండ్రీ" అని ప్రార్థించారు. తద్వారా తండ్రి యందు యేసయ్య, యేసయ్య యందు తండ్రి కలిసి వశిస్తున్నారని రుజువు పరిచారు. చివరగా సిలువలో తన ఆత్మను తండ్రికి అప్పగిస్తూ, తండ్రీ అని పిలిచినట్టుగా వాక్యములో చూస్తున్నాం. మనం కూడ యేసు క్రీస్తు రక్తము ద్వారా తండ్రి కృపాసనము నొద్దకు ధైర్యముతో వెళ్లి తండ్రీ అని ఆయనను పిలిచి, ప్రార్థించి మన జీవితాల్లో తండ్రి యొద్ద నుండి యేసుక్రీస్తు ద్వారా గొప్ప కార్యములు పొందుకుందాం.

అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక. ఆమేన్.. ఆమేన్.. ఆమేన్...